నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాంబశివరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ బాలాజీనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ సాయిబాబా ఫీడర్, 11కేవీ లక్ష్మీనర్సింహా ఫీడర్ల పరిధిలోని చెన్నాపూర్, బీరప్పగడ్డ, ఆదర్శనగర్, సింగిల్ బెడ్రూం ఇళ్లు, రేణుకానగర్, వికలాంగుల కాలనీ, లక్ష్మీనర్సింహా గుట్ట, ముత్తుస్వామి కాలనీ, సిటిజన్స్ కాలనీ, సుష్మితనగర్, సాయిబాబా టెంపుల్ రోడ్డు, మూడు గుళ్లు, చిలుక బిల్డింగ్, అయ్యప్ప స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ మల్కాజిగిరి అధ్యక్షుడిగా రాజు



నియామకపత్రం అందుకుంటున్న పాస్టర్ రాజు

గౌతంనగర్: నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ మల్కాజిగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా హనుమాన్‌పేట్ బేరియా బైబిల్ చర్చి పాస్టర్ రాజు నియమితులయ్యారు. అలాగే యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడిగా బి.సునీల్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నిరీక్షన్, సలహాదారుడిగా హారన్ నియామకమయ్యారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ఆనంద్ చేతులమీదుగా వారు నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్క ఏలియా, తెలంగాణ రీజినల్ చైర్మన్ డానియల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ



సీసీ కెమెరాల్లో నిందితుడి దృశ్యం

ఘట్‌కేసర్: మర్పల్లిగూడ దుర్గామాత ఆలయంలోని హుండీని గుర్తు తెలియని దుండగుడు బుధవారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లాడు. సమీపంలోని డంపింగ్ యార్డులోకి తీసుకెళ్లి హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లాడు. ఆలయంలోని సీసీ కెమెరాల్లో నిందితుడి దృశ్యాలు రికార్డు అయ్యాయి. హుండీలో ఎంత నగదు పోయిందనేది తెలియరాలేదు. దీంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

డ్రైనేజీ పైప్‌లైన్‌కు మరమ్మతు



డ్రైనేజీకి మరమ్మతు చేస్తున్న జలమండలి సిబ్బంది

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలో డ్రైనేజీ పైప్‌లైన్ పగిలి ఇళ్లలోకి డ్రైనేజీ చేరుతోంది. దీంతో ఎర్రకుంటకు చెందిన సామాజిక వేత్త గద్ద క్రాంతి కిశోర్ ఈ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, గద్ద క్రాంతి కిశోర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్: చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఘట్‌కేసర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలో ఐదేళ్ల చిన్నారిని కావటి శ్రీధర్ (21) అనే యువకుడు మంగళవారం రాత్రి సమీపంలోని ఇంటి సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. స్థానికులు గమనించి అతడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం కుటుంబ సభ్యులు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు దేవాంగ సంఘం సమ్మేళనం

చింతల్: తెలంగాణ దేవాంగ సంఘం ఆధ్వర్యంలో గురువారం చింతల్ హెచ్ఎంటీ గ్రౌండ్ ప్రాంగణంలో దేవాంగ కుటుంబ సభ్యుల సమ్మేళనం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమ్మేళనంలో శివపార్వతుల పూజ, భజన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం భోజనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



ఎల్లంపేట్ శివాలయంలో పూజల్లో బీజేపీ నాయకులు



ద్వాదశజ్యోతిర్లింగాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు



మేడ్చల్ రామలింగేశ్వర ఆలయంలో అభిషేకం..

వైభవంగా మహాశివరాత్రి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా వేడుకలు

- ఉదయం నుంచే ఆలయాలకు భక్తుల క్యూ
- అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- శివనామ స్మరణతో మార్మోగిన టెంపుల్స్
- కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా బుధవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ఉదయం నుంచే శివాలయాలకు క్యూ కట్టారు. హరోం హర.. శంభో శంకర అంటూ భక్తుల శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. కొందరు భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, జాగరణ చేశారు. అదేవిధంగా శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. –మేడ్చల్ జోన్ బృందం



పూడూర్‌లో ప్రత్యేక అలంకరణలో శివయ్య



ఘట్‌కేసర్ లింగాలకుంటలో అభిషేకం..



పోచారంలో స్ఫటికలింగేశ్వరస్వామికి అభిషేకం..



నృత్యం చేస్తున్న చిన్నారులు



కీసరగుట్టలో దర్శనం కోసం క్యూలో భక్తులు

కీసరగుట్ట కిటకిట

కీసర: కీసరగుట్ట శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం రోజున శివుడిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతందన్న నమ్మకంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఐదంతస్తుల రాజగోపురానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు పసుపు, కుంకుమ, పాలు, నూనె, నెయ్యితో అభిషేకాలు నిర్వహించారు. మరోవైపు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో వేద పండితులు స్వామివారికి నందివాహన సేవను వైభవంగా నిర్వహించారు. రాత్రి 12 గంటలకు (లింగోద్భవకాలంలో) శ్రీరామలింగేశ్వర స్వామికి సంతతధారాభిషేకం పూజను నిర్వహించారు. సాయంత్రం వరకు దాదాపు లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, జిల్లా ఉన్నతాధికారులు, డీసీపీ పద్మజా, ఏసీపీ నరేందర్‌గౌడ్, అధికారులు దర్శనం త్వరగా అయ్యేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు, డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీ ఈటల రాజేందర్, దేవాదాయ శాఖ కమిషనర్ సుబ్రహ్మణ్యం, జడ్జీలు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకున్నారు.



గర్భాలయంలో శ్రీరామలింగేశ్వరస్వామివారు



కీసరగుట్ట పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్



విద్యుత్ దీపాలతో కీసరగుట్ట ఆలయం





శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

మహాశివరాత్రి జాతర విశేషాలు

- కీసరగుట్టలో క్యూలో భక్తులకు ఈసీఐఎల్‌లోని సోలీస్‌ఐ ఆసుపత్రి, ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, పాలు,పండ్లు పంపిణీ చేశారు.
- ఉదయం 8 వరకు మోస్తారుగా ఉన్న భక్తుల రాక తర్వాత పెరగడంతో ధర్మదర్శనాలు, ప్రత్యేక దర్శనాల క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. సామాన్య భక్తులు దర్శనం కోసం 3 నుంచి 4 గంటల పాటు క్యూలో నిల్చోవాల్సి వచ్చింది. ఇక రూ. 500 ఆన్‌లైన్ టికెట్ బుక్ చేసుకున్న భక్తులు కూడా దర్శనానికి 2 గంటలకు పైగా సమయం కావడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- వీఐపీ పాస్‌ల క్యూలైన్‌లో కూడా భక్తులు దర్శనం కోసం సుమారు 2 గంటల సేపు వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇక పోలీసులు, అధికారులు యేటా లాగే తమ కుటుంబసభ్యులు, తమ ఉన్నతాధికారుల కుటుంబ సభ్యులను వాహనాల్లో పైకి తీసుకెళ్లి ప్రోటోకాల్ లైన్‌గుండా పంపి దర్శనాలు చేయించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పోలీస్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- పార్కింగ్ నుంచి కీసరగుట్ట ప్రధాన క్యూలైన్‌వరకు వృద్ధులు, చిన్నపిల్లల తల్లిదండ్రులను తరలించేందుకు ఆటోలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది.
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు గుట్టలోనే ఉండి బందోఓబస్తును స్వయంగా పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనుకోకుండా కాలి గాయం అయిన భక్తుడికి కమిషనరే స్వయంగా దగ్గరుండి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం చికిత్స కోసం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.
- కీసరగుట్ట యాత్రికులకు రెడ్డి సంక్షేమ, ఆర్య వైశ్య, వంశరాజ్, మున్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కూడా అన్నదానాలు నిర్వహించారు.



కీసరగుట్టలో బందోబస్తు పర్యవేక్షిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉప్పల్ మినీ శిల్పారామంలో బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ డా. సాయి జీవన బృందం నిర్వహించిన కథక భరత నాట్య ప్రదర్శనలు అలరించాయి. గణేశ్ వందన, కాళీకౌతం, అభినయ్ గీత్, కీర్తనై, తులసీదాస్ భజన, వర్ణం, సరస్వతి, శివ కై లాసానికి తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం

ఆల్విన్‌కాలనీ: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సుమిత్రనగర్‌లో సత్యవేద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకూ ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. రాకపోకలు సాగించే క్రమంలో నీళ్లకు ఇబ్బంది పడకుండా ఉండటానికి చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి పలు ప్రాంతాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, పురేందర్ రెడ్డి, దొడ్ల రామకృష్ణ గౌడ్, కాశీనాద్‌యాదవ్, సత్యవేద ఫౌండేషన్ మేనేజర్ విజయకుమార్, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎడ్వర్డ్ రాస్, పాస్టర్లు మాణిక్యం, కొమ్ము సాగర్, దాసు, వినయ్, జాన్, రమేష్, రవి, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



నేడు ఉచిత వైద్య శిబిరం

చింతల్: ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం చింతల్ హెచ్ఎంటీ కాలనీలోని పోచమ్మ ఆలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉషారాణి నేచురోపతి క్లినిక్ అక్యుపంచరిస్ట్ రాధిక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరంలో బీపీ, డయాబెటీస్ టెస్టులతో పాటు ఇతర పరీక్షలపై 20 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

దుండిగల్: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీలోని బౌరంపేట ప్రాంతానికి చెందిన నవీన్ కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును బుధవారం బౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నవీన్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫిషర్మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోచి మహేష్, దుండిగల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి అర్కల విజయ్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది సురేష్ పాల్గొన్నారు



చిగురిస్తున్న ఆశలు

- మార్చి 1న కొత్త రేషన్ కార్డుల పంపిణీ
- 8 డివిజన్ కార్యాలయాల్లో అందజేత
- 28 వేల మంది దరఖాస్తులు



ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న నూతన రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. మార్చి1వ తేదీన కార్డులను అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో నిరుపేదల కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్ల నుంచి నూతన రేషన్ కార్డుల పంపిణీ లేకపోవడంతో పేదల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాలంటే రేషన్ కార్డులు కీలకం. ఎట్టకేలకు ప్రభుత్వం రేషన్ కార్డులను అందజేయనుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని 8 డివిజన్ కార్యాలయాల్లో కార్డులను అందజేయనున్నారు.

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 'ప్రజా పాలన' తో పాటు మీ–సేవా కేంద్రాల ద్వారా కొత్త రేషన్ కార్డులు, పాత కార్డులో సవరణల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. దరఖాస్తులను పౌర సరఫరాల శాఖ అధికారులు పరిశీలించి తుది జాబితాను తయారు చేశారు. ఒకే రోజు అటు హైదరాబాద్ ఇటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో లక్ష రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మంగళవారం ప్రకటించడంతో నిరుపేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. నియోజకవర్గంలో మీ సేవ ద్వారా, ప్రజా పాలన ద్వారా రేషన్‌కార్డు కోసం 28 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు.

పారిశ్రామికవాడల్లో పేదలే అధికం

నియోజకవర్గంలో అత్యధిక శాతం పేద, మధ్య తరగతి ప్రజలే జీవనం సాగిస్తున్నారు. కష్టం చేస్తే కానీ పూట గడవని ప్రజలకు రేషన్ కార్డు తప్పనిసరి. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా ఉన్న జీడిమెట్లతో పాటు గాంధీనగర్, బాలానగర్ పారిశ్రామిక వాడలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజాపాలన ద్వారా బాలానగర్ పౌర సరఫరాల శాఖ పరిధిలో ఉన్న కుత్బుల్లాపూర్, గాజులరామారం, కూకట్‌పల్లి, మూసాపేట్, శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఉన్న వివేకానంద నగర్ కాలనీ, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ ప్రాంతాల్లో మొత్తం 227 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 2,04,414 రేషన్ కార్డులో ఉన్నాయి. ప్రజా పాలన ద్వారా మొత్తం 35,807 కొత్త దరఖాస్తులు రాగా.. అవగాహన లేని వారితో పరిశీలన చేయడం ద్వారా ఇందులో సగం దరఖాస్తులను జాబితా నుంచి తొలగించారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. తాజాగా వచ్చిన దరఖాస్తులను వడపోసి తుది జాబితా రూపొందించే పనిలో పడ్డారు బాలానగర్ పౌర సరఫరాల శాఖ అధికారులు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఉంటుందని ప్రకటించిందని, లిఖితపూర్వకంగా ఆదేశాలు రాగానే వార్డు కార్యాలయాల్లో రేషన్ కార్డులు అందజేస్తామని బాలానగర్ పౌర సరఫరాల శాఖ అధికారి కల్యాణ్ తెలిపారు.

ఆస్తి పన్ను హైప్..!

సాక్షి,సిటీబ్యూరో: పురపాలికల్లో ఆస్తి పన్ను మదింపునకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయండతో 2025–26 ఆర్థిక సంవత్సరంలో నూతన విధానం అమలు కానున్నది. ఈ మేరకు మున్సిపాలిటీల పరిధిలోని వ్యవసాయేతర ఆస్తుల విలువలు సవరించి ఆస్తి పన్ను విధించనుండగా, ఎంత పన్ను పెరగనున్నదో వివరాలు సేకరించే పనిలో పుర అధికారులు నిమగ్నమయ్యారు.

ఖాళీ స్థలాలపై పన్ను

నగర శివారు పురపాలికల్లో చాలామంది ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టకుండా వదిలేస్తున్నారు. ఇలా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో వేల సంఖ్యలో ఖాళీ (ప్లాట్లు)స్థలాలున్నాయి. వీటికి వీఎల్ (వేకెండ్ ల్యాండ్ ట్యాక్స్) విధించాల్సి ఉంటోంది. అయితే పురపాలికల్లో అధికారులు పట్టించుకోకపోవడంతో వీటికి ఇప్పటివరకు ఎలాంటి పన్నులు విధించని పరిస్థితి నెలకొన్నది. ఇక మీదట ఖాళీ స్థలాలకు వీఎల్ పన్ను చెల్లించమంటే కుదరదు. ఆస్తి విలువలో కనిష్ఠంగా 0.05, గరిష్ఠంగా 0.20 శాతం పన్ను ఖరారు చేయనున్నారు. ఖాళీ స్థలాల్లో భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణానికి అనుమతి తీసుకోవాలంటే..వీఎల్ పన్ను రసీదును జత చేయాల్సి ఉంటోంది. మున్సిపాలిటీల్లో నిధులు లేకపోవడంతో తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులు, అభివృద్ధి పనులకు సైతం ఇబ్బందిగా మారుతోంది. అయితే ఇప్పుడు ఆస్తి పన్ను ద్వారా వచ్చే ఆదాయంతో వేతనాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను మదింపు ప్రక్రియ పూర్తి చేసి కొత్త పన్ను విధానం అమలు చేసేలా కసరత్తు చేస్తున్నట్లు మున్సిపల్ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



ఆస్తి పన్ను నిబంధనలు ఇలా..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 మున్సిపాలిటీలు ఉన్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నివాస భవనాలకు నిర్మాణ విలువలో కనిష్ఠంగా 0.10 శాతం, గరిష్ఠంగా 1 శాతం ఆస్తి పన్ను పెంచనున్నారు. వాణిజ్య భవనాలకు మార్కెట్ విలువలో కనిష్ఠంగా 0.25 శాతం, గరిష్ఠంగా 2 శాతం పన్ను పెరుగుతోంది. పురపాలక చట్టం ప్రకారం 75 గజాల్లోపు ఉన్న భవనానికి ఆస్తి పన్ను పెంపు వర్తించదు. వీటితో పాటు చారిత్రక భవనాలు, ఆసుపత్రులు, పురపాలక భవనాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు మినహాయింపు ఉంటుంది.

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను మదింపునకు ఆదేశాలు

- 2025–26 ఆర్థిక సంవత్సరంలో నూతన విధానం అమలు
- శివారు 29 పురపాలికల్లో వ్యవసాయేతర ఆస్తుల విలువలు సవరించి ఆస్తి పన్ను ఖరారుపై కసరత్తు
- వివరాల సేకరణలో పుర అధికార యంత్రాంగం
- నగర శివారు11 పురపాలికల్లో 40 గ్రామ పంచాయతీల విలీనం

పన్ను మదింపుపై కసరత్తు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రస్తుతం 13 పురపాలక సంఘాల నుంచి వివిధ పన్నుల ద్వారా రూ.190 కోట్ల ఆదాయం సమకూరుతుండగా, రంగారెడ్డి జిల్లాలోని 16 మున్సిపాలిటీల నుంచి రూ.175 కోట్లు వసూలు అవుతున్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల ప్రభుత్వం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 7 పురపాలక సంఘాల్లో సమీపంలోని 28 గ్రామ పంచాయతీలను విలీనం చేయగా, రంగారెడ్డి జిల్లాలో 4 పురపాలక సంఘాల్లో 12 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. దీంతో విస్తరించిన ఆయా పురపాలక సంఘాలకు వివిధ పన్నుల ద్వారా ఆదాయం పెరిగే అవకాశమున్నది. మున్సిపాలిటీల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కాలనీల సంఖ్య కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో ఆయా కాలనీల్లో మౌలిక వసతులను కూడా పురపాలక సంఘాలే కల్పించాల్సిన అవసరముండడంతో అందుకు అనుగుణంగా ఆస్తి పన్ను మదింపుపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.